

## బ్లేడ్ బ్యాచ్ దాడి అవాస్తవం

**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం**

నగరంలోని వెంకటేష్‌నగర్‌కు చెందిన మనుకొండ నాగరాజు(25)పై బ్లేడ్ బ్యాచ్ దాడి చేసిందంటూ సోషల్ మీడియాలో వచ్చిన వార్తల్లో నిజం లేదని పోలీసులు స్పష్టం చేశారు. నాగరాజు ఫోన్ నెంబర్‌కు గుర్తు తెలియని వ్యక్తి రెండు రోజులుగా ఫోన్ చేసి దూషిస్తున్నాడు. దీంతో ఈ నెల 18న రాత్రి 8గంటల సమయంలో బైకుపై నాగరాజు ఇంటి నుంచి బయలుదేరి మార్గం మధ్యలో బీర్ బాటిల్ కొనుగోలు చేశాడు. అది తాగి 9 గంటల సమయంలో బాటిల్ పగలగొట్టి తనకు తానుగా పొట్టపై గీసుకున్నాడు. తరువాత నుదిటిపై బాటిల్‌తో కొట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో నాగరాజుపై దాడి జరిగిందని కొన్ని సోషల్ మీడియాల్లో వార్తలు వచ్చాయన్నారు. వాట్సాప్‌లో చాటింగ్ చేసిన వారిని బెదిరించేందుకు నాగరాజు తనకుతానుగా గాయాలు చేసుకున్నాడు తప్ప ఎలాంటి దాడి జరగలేదని తెలిపారు. ఈ మేరకు మూడో పట్టణ పోలీసులు అన్ని ఆధారాలు సేకరించారని తెలిపారు.

# వీఆర్‌ఎలకు రికవరీ

**ఒక్కొక్కరి నుంచి రూ.13,500 వసూలుకు ఆదేశం**

**ప్రతి నెలా రూ.2,600 డిడిల ద్వారా చెల్లింపు**

**ఎన్నికల హామీలు బుట్టదాఖలు**

**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి**

వీఆర్‌ఎల నుంచి డిఎ రికవరీ వారి పాలిట గుదిబండలా మారింది. గ్రామాల్లో కొద్దిపాటి జీతంతో పనులు చేస్తున్న వీఆర్‌ఎలకు సరికొత్త కష్టాలు వచ్చాయి. ప్రభుత్వం వారి పట్ల కఠిన వైఖరి అవలంబిస్తోంది. గత మూడున్నర ఏళ్లుగా వారి డిమాండ్లను పట్టించుకోకపోగా ఎప్పుడో ఇచ్చిన డిఎలను ప్రభుత్వం తిరిగి వసూలు చేస్తోంది.

**ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు**

గ్రామ రెవెన్యూ సహాయకుల నుంచి డిఎ సొమ్మును రికవరీ చేయడం దుర్మార్గం. గతంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి చూడలేదు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఆందోళనలు చేసినా ఫలితం లేకపోయింది. గత్యంతరం లేక రెండు నెలలుగా నెలకు రూ.2600 చొప్పున డిడిలు తీసి చెల్లిస్తున్నాం. ఈ నగదు చెల్లించకపోతే మరుసటి నెల వేతనం విడుదల కాదని అధికారులు చెబుతున్నారు.

**- మల్లిమొగ్గల వెంకటరమణ, జిల్లా అధ్యక్షులు, వీఆర్‌ఏ అసోసియేషన్**


గత ప్రభుత్వం 2018లో వీఆర్‌ఎలకు జీతాలు పెంచడంతో పాటు డిఎను కూడా మంజూరు చేసింది. అయితే గత ప్రభుత్వం జారీ చేసిన జీఓలో తప్పు ఉందని, ఈ కారణంగా అదనంగా వేతనం తీసుకున్నారని వైసిపి ప్రభుత్వం చెబుతోంది. ఈ నేపథ్యంలో మూడు నెలలుగా డిఎను వారి నుంచి ప్రభుత్వం రికవరీ చేస్తోంది. దీంతో వీఆర్‌ఎలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం అరకొరగా చెల్లిస్తున్న జీతాలను పెంచకపోగా ఇలా తిరిగివ్వాలని వేధింపులకు గురిచేస్తుండటంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

**వేతనాలు నిలిపివేస్తామంటూ హెచ్చరికలు**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2,600 మంది వరకూ వీఆర్‌ఎలు ఉన్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.13,500 వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో 2 నెలలుగా నెలకు రూ.2600 చొప్పున వీఆర్‌ఎలు డిడిల రూపంలో ప్రభుత్వానికి చెల్లిస్తున్నారు. వీఆర్‌ఎలకు ప్రభుత్వం రూ.10,480 మాత్రమే వేతనం చెల్లిస్తోంది. మరుసటి నెల వేతనం విడుదల చేయాలంటే ఈ నెలలో రూ.2600 చెల్లించాల్సిందేనని ఉన్నతాధికారులు తేల్చి చెబుతున్నారు. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న తమకు పూర్తిగా వేతనం నిలిపివేస్తే కుటుంబ పోషణ కష్టతరమవుతుందని స్థోమత లేకపోయినా తిరిగి జమ చేస్తున్నారు. తమకు ఎలాంటి అదనపు జీతం రాలేదని, అందువల్ల ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని అనేకసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పరిస్థితి లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు బుట్టదాఖలు**

రెవెన్యూ శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వీఆర్‌ఎలపై తీవ్రమైన పని ఒత్తిడి పెరుగుతోంది. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకోవడంతో పాటు, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే పనుల్లోనూ కీలకంగా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం 6 గంటలకు విధులకు హాజరైతే తిరిగి ఇంటికి చేరేసరికి రాత్రి 8 గంటలు దాటుతోందని వీఆర్‌ఎలు వాపోతున్నారు. దీనికి తోడు నిత్యం విధి నిర్వహణలో అక్రమార్కులు తమను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేయడం పరిపాటిగా మారింది. వీఆర్‌ఎలకు రక్షణ కల్పించడంతో పాటు, గౌరవ వేతనం బదులుగా కనీస వేతనం ఇస్తామని ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రకటించారు. అధికారంలోకొచ్చి మూడున్నరేళ్లు గడిచింది. కొత్తగా వేతనాలు పెంచకపోగా గత ప్రభుత్వం పెంచిన వేతనాలను రికవరీ చేయడ కలవరానికి గురి చేస్తోంది. ఉద్యోగుల పట్ల ప్రభుత్వ తీరును దర్పణం పడుతుంది.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యఅతిథులు

# భారత్‌రంగ్ మహోత్సవ్ ప్రారంభం

**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం**

స్థానిక ఆనం కళాకేంద్రంలో భారత్‌రంగ్ మహోత్సవ్-2023 ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా స్కూల్ ఆఫ్ డ్రామా అండ్ అఫైర్స్ సంచాలకులు అభిలాష్ పిళ్లై హాజరయ్యారు. ప్రొఫెసర్ డాక్టర్ అభిలాష్ పిల్లై, వీణ శర్మ, మల్లికార్జునరావు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పిళ్లై మాట్లాడారు. ఈ కార్యక్రమానికి తనను ఆహ్వానించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. భారతీయ సంస్కృతి సంప్రదాయలను ప్రపంచానికి తెలియజేయడంలో నాటకరంగానిది ప్రముఖమైన పాత్ర అన్నారు. నాటక రంగానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందన్నారు. ఈ రంగంలో ఉన్న కళాకారులకు ప్రోత్సాహం ఇచ్చేందుకు నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. ఎన్ఎస్‌డి సెంటర్ డైరెక్టర్ వీణ శర్మ మాట్లాడుతూ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ప్రపంచంలోనే అగ్రగామి థియేటర్లు శిక్షణ సంస్థల్లో ఒకటి అన్నారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిందన్నారు. ఎన్ఎస్‌డిలో నసీరుద్దీన్ షా, ఓం పురి, అనుపమ కేర్, ఇర్ఫాన్ ఖాన్, నవాజుద్దీన్ సిద్ధికి, వంటి ప్రముఖ భారతీయ చలనచిత్రాల నటులు తర్ఫీదు పొందినవారేనన్నారు. రాజమహేంద్రవరంలోనూ ఈ శాఖను ఏర్పాటు చేయడం శుభపరిణామన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకులు ఆర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రదర్శనలను ఇక్కడ ఇవ్వడం అభినందనీయమన్నారు. తొలి రోజు తెలంగాణ రాష్ట్ర హైదరాబాద్‌కు చెందిన శ్రీ వెంకటేశ్వర సురభి థియేటర్ గ్రూప్‌వారు 'భక్త ప్రహ్లాద' నాటకాన్ని ప్రదర్శించారు. సోమవారం కర్ణాటక రాష్ట్ర మంగుళూరుకు చెందిన అస్థిత్వ థియేటర్ గ్రూప్ 'కొండోనియన్స్' నాటకాన్ని ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం సెంటర్ ఇన్‌ఛార్జి భూపతి, డిఇఒ ఎస్.అబ్రహాం, డిప్యూటీ డిఇఒ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భక్త ప్రహ్లాదలో ఓ సన్నివేశం

# సందీప్ మృతికి పలువురి సంతాపం

**ప్రజాశక్తి - ధవళేశ్వరం, కడియం**

కడియం ఎంపిడిఒ రత్నకుమారి కుమారుడు సందీప్ మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. ధవళేశ్వరంలోని అఫీషియల్ కాలనీలో ఎంపిడిఒ స్వగృహం వద్ద సందీప్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్యచౌదరి సందీప్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉజ్వల భవిష్యత్తు కలిగిన సందీప్ మరణం బాధాకరమన్నారు. ఎంపిడిఒను ఓదార్చారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు. సందీప్ అంత్యక్రియలు ఆదివారం కొవ్వూరులో పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఎంపిడిఒను పలువురు పరామర్శించి ఓదార్చారు. పరామర్శించిన వారిలో టిడిపి నాయకులు అన్నందేవుల చంటి, వెలుగుబంటి నాని, ప్రత్తిపాటి రామారావుచౌదరి, చెల్లబోయిన శ్రీనివాసు, ఉమ్మడి దేవి, ఎంఇఒ లజపతిరాయ్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ చంద్రరావు, పలువురు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

**సందీప్ మతిపై విచారణ జరపాలి : స్టాలిన్**

కడియం ఎంపిడిఒ కుమారుడు సందీప్ మృతిపై విచారణ జరపాలని జేగురుపాడు సర్పంచ్, న్యాయవాది స్టాలిన్ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం నగరంలో వైద్యం వ్యాపారంగా మారిందన్నారు. పుట్టగొడుగుల్లా వెలిసిన వైద్యాలయాలు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబులు, బ్లడ్ బ్యాంకుల్లో చాలా వాటికి అనుమతులు, ప్రామాణికత లేవన్నారు. ఉజ్వల భవిష్యత్ కల్గిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మట్టా సందీప్ లాంటి యువకుడు మృతి చెందడం చాలా బాధను కలిగిస్తుందన్నారు. గ్యాస్ట్రో సంబంధిత చిన్నపాటి సమస్యతో చేరిన సందీప్ మృతి చెందాడని స్టాలిన్ చెప్పారు. ఇది సాధారణ మరణంగా పరిగణించడం తగదని అతని మతిపై విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.



సందీప్‌కు నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ గోరంట్ల

## నగరంలో ఐహెచ్‌సిఎల్ హోటల్ ప్రారంభం

**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం**

భారతదేశంలో అతిపెద్ద ఆతిథ్య కంపెనీ ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్(ఐహెచ్‌సిఎల్) నగరంలో మొదటి హోటల్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు శైలజ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రవేట్ లిమిటెడ్ సంస్థతో ఆదివారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసింది. ఈ మేరకు గ్రీన్‌ఫీల్డ్ హోటల్‌ను వివాంతా బ్రాండ్‌గా మార్చనున్నారు. ఐహెచ్‌సిఎల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సుమ వెంకటేష్ మాట్లాడారు. దేశంలో అభివద్ధి చెందుతున్న మార్కెట్‌లలో తమ కార్యకలాపాలను బలోపేతం చేసేందుకు ఈ ఒప్పందం చేసుకున్నామన్నారు. భారీ పరిశ్రమలకు రాజమహేంద్రవరం అనుకూలంగా ఉందన్నారు. అంతేకాకుండా భారతదేశంలో అతిపెద్ద ఆఫ్‌షోర్ గ్యాస్ ఫీల్డ్స్‌కూ ఇది సమీపంలో ఉందన్నారు. శైలజ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఈ నగరంలో వివాంతా హోటల్ ఏర్పాటుకోసం ఒప్పందం చేసుకున్నామన్నారు. మధురపూడి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అత్యంత సౌకర్యవంతమైన దూరంలో ఈ 120 గదులతో హోటల్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. నౌకాశ్రయ నగరం కాకినాడకు సైతం ఈ హోటల్ దగ్గరగానే ఉంటుందని తెలిపారు. అధునాతన సౌకర్యాలతో ఈ హోటల్‌ను తీర్చిదిద్దామని చెప్పారు. అందరినీ ఆకట్టుకునేలా హోటల్ గదులు, ఇతర వసతులను కల్పించామని పేర్కొన్నారు.



తారకరత్నకు నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ భవాని తదితరులు

## తారకరత్నకు పలువురి నివాళి

**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం**

సినీ నటుడు నందమూరి తారకరత్న మృతికి పలువురు నివాళులరింపచారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో తారకరత్న సంతాప సభ టిడిపి నగర అధ్యక్షుడు రెడ్డి మనేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. తొలుత తారకరత్న చిత్రపటానికి ఎంఎల్ఎ ఆదిరెడ్డి భవాని, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎంఎల్ఎ ఆదిరెడ్డి భవాని మాట్లాడారు. తారకరత్న తాను ఒకే స్కూల్లో చదువుకున్నామని, మంచి స్నేహితులమని గుర్తు చేసుకున్నారు. తారకరత్న మంచి వ్యక్తిత్వం కలిగిన మనిషన్నారు. నందమూరి వంశానికి చెందిన ఆయన ఆ దర్పాన్ని ఏనాడు చూపించలేదన్నారు. అటువంటి వ్యక్తి దూరం కావడం బాధాకరమన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ తారకరత్న కుటుంబ సభ్యులకు, అభిమానులకు భగవంతుడు మనోధైర్యాన్ని కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి టి.నరసింహారావు, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి బుడ్డిగ గోపాలకృష్ణ, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు, రాజమండ్రి పార్లమెంట్ మహిళ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, పార్లమెంట్ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి కొయ్యల రమణ, తదితరులు పాల్గొన్నారు.

# నష్ట పరిహారం కోసం రైతుల ధర్నా

**ప్రజాశక్తి - పెరవలి**

నకిలీ పురుగు మందు వల్ల నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలంటూ రైతులు, కౌలు రైతులు ధర్నాకు దిగారు. మండలంలోని కానూరులో ఉన్న మూడు పురుగు మందుల షాపుల నుంచి సుమారు 90 మంది రైతులు పురుగు మందును కొనుగోలు చేశారు. ఈ మందు కొట్టిన వరిచేలు పూర్తిగా కుళ్లిపోయాయి. దీంతో రైతులు ఆయా షాపుల యజమానులను నిలదీశారు. రెండు షాపుల యజమానులు పోయిన నష్టపోయిన కౌలు రైతులకు ఎకరాకు రూ.75వేలు పరిహారం ఇచ్చేందుకు అంగీకరించారు. మరో షాపు యజమాని మాత్రం పరిహారం ఇచ్చేందుకు నిరాకరించాడు. దీంతో రైతులు, కౌలు రైతులు శనివారం అర్ధరాత్రి సమయంలో పురుగు మందు షాపు వద్ద ధర్నాకు దిగారు. యజమాని అందుబాటుల లేకపోవడంతో ఆదివారం షాపు ఎదుట నిరసన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న యజమాని రైతులతో మాట్లాడారు. న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో వారు ధర్నాను విరమించారు. రూ.200 విలువ చేసే పురుగు మందు డబ్బాను రూ.900 వరకూ అమ్మకాలు సాగించినట్టు సమాచారం. ఒరిజినల్ కోరాజిన్ పురుగు మందును పోలి ఉండటంతో ఎక్కువ మంది దీన్ని కొని నష్టపోయారు. ధర్నాకు బిఎస్‌పి నాయకులు మద్దతు తెలిపారు. కల్తీ పురుగు మందు అమ్మకాలు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవట్లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ధర్నాలో బిఎస్‌పి నాయకులు, రైతులు వి.సుధాకర్, జి.వెంకటేష్, ఎం.శ్రీను, కె.సత్యనారాయణ, జె.రామకృష్ణ, వి.ధర్మరాజు, శ్రీను మహిళా రైతులు పాల్గొన్నారు.



1990 ఏడాది పదోతరగతి విద్యార్థులు

## అపూర్వ సమ్మేళనం

**ప్రజాశక్తి - తాళ్లపూడి**

ప్రస్తుత సమాజంలో పూర్వపు విద్యార్థులు ఏదో ఒక సమయంలో తరచూ కలుసుకుంటూ నాటి జ్ఞాపకాలను స్మరించుకోవడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని వేగేశ్వరపురంలో గల కెవిఎస్‌ఆర్‌పిహెచ్ పాఠశాలలో 1990 సంవత్సరం పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మైక్ సెట్‌ను వారు పాఠశాలకు అందించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సర్పంచ్‌లు కొమ్మిరెడ్డి పరశురామారావు, ఎల్లిన శివరామకష్ణ, కళాశాల ప్రతినిధి సూర్యనారాయణ, అప్పటి డ్రిల్ మాస్టర్ జోషిమణి మాట్లాడారు. చదివని స్కూల్ అభివృద్ధికి తోడ్పడటం అభినందనీయమన్నారు. పాఠశాల సిబ్బంది సత్యనారాయణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శివాజీ జయంతి

**ప్రజాశక్తి - గోపాలపురం, తాళ్లపూడి**

స్థానిక చెక్‌పోస్టు సెంటర్ వద్ద జనసేన ఆధ్వర్యంలో శివాజీ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జెఎస్‌పి నియోజకవర్గ నాయకులు దొడ్డిగర్ల సువర్ణ రాజు ఆధ్వర్యంలో కేకు కట్ చేసి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా గల్లా శ్రీను, దొడ్డిగర్ల సువర్ణ రాజు మాట్లాడారు. గెరిల్లా యుద్ధం ద్వారా శత్రువుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన మహావీరుడు శివాజీ అని కొనియాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం చైర్మన్ శాంతా రమేష్ బాబు, కె.రత్నాజీచౌదరి, జి.సత్యనారాయణ, బి.సహదేవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తాళ్లపూడి గాంధీ బొమ్మ సెంటర్లో చత్రపతి చిత్రపటానికి పలువురు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తాళ్లపూడి బస్టాండ్ సెంటర్ నుంచి బైకు ర్యాలీ నిర్వహించారు. బొర్రా శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో శివాజీకి నివాళులర్పిస్తున్న యువకులు

## అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - చాగల్లు**

అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు మండలంలోని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆర్థిక సాయం అందించింది. నల్లజర్ల మండలం పోతవరం పంచాయతీ శివారు కృష్ణాయగూడేనికి చెందిన జొన్నకూటి గంగకి చెందిన తాటాకిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో తెలుసుకుని నిరాశ్రయులైన కుటుంబ సభ్యులకు చాగల్లు మండల ఎంప్లాయిస్ ఫెడరేషన్ రూ.15వేల సాయం అందించిందని ఫెడరేషన్ సభ్యులు కొడమంచిలి సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో గెల్లా రాజు, బి.మధుశేఖర్, ఎం.జమలయ్య పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఎంఎల్ఎ రాజా పరామర్శ

**ప్రజాశక్తి-కోరుకొండ**

మహాశివరాత్రినాడు పట్టిసీమలో ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి మృతి చెందిన యువకుల కుటుంబాలను రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా ఆదివారం పరామర్శించారు. ఈ ప్రమాదంలో దోసకాయల పల్లి గ్రామానికి చెందిన ఓలేటి అరవింద్(20), ఎస్‌కె.లక్ష్మణ్(19), పెద్దిరెడ్డి రాంప్రసాద్(18) మతిచెందిన సంగతి విదితమే. వారి కుటుంబాలను రాజా పరామర్శించారు. మనోధైర్యంతో ముందుకు సాగాలని కుటుంబ సభ్యులకు ధైర్యంచెప్పారు. ఆయన వెంట జడ్‌పిటిసి సభ్యులు కర్రి నాగేశ్వరావు, దూలం పెద్ద, నక్క రాంబాబు, పోశియ్య, కె.దుర్గారావు, కె.ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు అబ్బాయి తదితరులున్నారు.

## జర్నలిస్ట్ సతీష్‌చందర్ అరెస్టు అప్రజాస్వామికం

**ప్రజాశక్తి - పెరవలి**

జర్నలిస్టు సతీష్‌చందర్, ఇతర మేధావులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ప్రముఖ న్యాయవాది వెన్నపు సుధాకర్ అన్నారు. భారత రాజ్యాంగం- మనుధర్మ శాస్త్రం అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ప్రముఖ జర్నలిస్ట్ సతీష్‌చందర్, జర్నలిజం కళాశాల కరస్పాండెంట్ గౌరీ,కవి జయరాజు ఇతర మేధావులు వచ్చారన్నారు. వారికి అప్రజాస్వామికంగా హైదరాబాద్‌లో ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారన్నారన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## తిరుమలశెట్టి కుటుంబానికి జక్కంపూడి పరామర్శ

**ప్రజాశక్తి- కడియం**

ఇటీవల మతి చెందిన నర్సరీ రైతు తిరుమలశెట్టి సత్యనారాయణ మూర్తి కుటుంబాన్ని రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా పరామర్శించారు. ఆదివారం కడియపులంకలో తిరుమలశెట్టి సోదరులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తొలుత సత్యనారాయణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో కడియపుసావరం మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు తదితరులున్నారు.





**కార్టూ'నిజం'**

నిర్మాణం పూర్తి ఎప్పుడు? అని మాత్రం అడక్కండయ్యా..! కావాలంటే మరోసారి శంకుస్థాపన చేస్తారు.. సారు..!!

# కుడిపూడి విజయానికి కృషి చేద్దాం

**రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్**

**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం**

స్థానిక సంస్థల ఎంఎల్‌సి వైసిపి అభ్యర్థిగా పోటీ పడుతున్న కుడిపూడి సూర్యనారాయణ విజయానికి కృషి చేద్దామని ఎంపీ మార్గాని భరత్ పిలుపునిచ్చారు. నగరంలోని వి.ఎల్.పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో గల ఎంపీ కార్యాలయంలో ఎంపీ భరత్‌ను కుడిపూడి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. ఉభయ గోదావరి జిల్లాలో అత్యధిక జనాభా బిసిలే ఉన్నారన్నారు. సిఎం జగన్ బిసిల రాజకీయ ఉన్నతికి అన్ని విధాలా కృషి చేస్తున్నారని అనడానికి కుడిపూడి నియామకమే నిదర్శనమన్నారు. గతంలో చంద్రబాబు బిసిలను నిర్లక్ష్యం చేశారన్నారు. అందుకే ఆయన ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పది పన్నెండు స్థానాల్లో బిసిలకు ఎంఎల్ఎ టికెట్లు కేటాయించాలన్నారు. ఇదే విషయాన్ని సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. బిసి అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత ఆ సంఘీయులపైనే ఉందన్నారు. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో కుడిపూడిని అఖండ మెజారిటీతో గెలిపించి శాసన మండలికి పంపాలన్నారు. బిసి జెఎసి చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు మాట్లాడుతూ కుడిపూడి సూర్యనారాయణ తండ్రి బీసీలకు చేసిన సేవలను గుర్తు చేశారు. తండ్రికి తగ్గ తనయునిగా కుడిపూడి సూర్యనారాయణకు మంచి పేరుందన్నారు. స్థానిక సంస్థల ఎంఎల్‌సి అభ్యర్థిగా కుడిపూడిని ప్రకటించడం పట్ల సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎల్‌సి అభ్యర్థి కుడిపూడి సూర్యనారాయణ మాట్లాడుతూ బిసిల్లో రాజకీయ చైతన్యం కనిపిస్తుందన్నారు. ఇది సంతోషకరమైన పరిణామమన్నారు. ఎంఎల్‌సి అభ్యర్థిగా ప్రకటించిన సిఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సభకు కడలి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో నగర గౌడ శెట్టిబలిజ సంఘ గౌరవ అధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్, అధ్యక్షుడు రెడ్డి రాజు, బార్ అసోషియేషన్ ప్రతినిధులు ఇళ్ల శివప్రసాద్, పాలిక శ్రీను, పిల్లి నిర్మల, డాక్టర్ అనుసూరి పద్మలత, కాళ్ళ ఈశ్వరప్రసాద్, దుంగ మంగ, పెంకే సురేష్, రాయుడు గణేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ భరత్, కుడిపూడిని సత్కరిస్తున్న నాయకులు

## 'ఇదేం ఖర్మ..'లో గోపాలపురం ప్రథమం

**ప్రజాశక్తి - గోపాలపురం**

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు పిలుపు మేరకు చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహణలో రాష్ట్రంలోనే గోపాలపురం నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తీసుకెళ్లామన్నారు. స్థానిక నాయకులను కలుపుకొని ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ అవినీతిని ప్రజలకు వివరించామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి గెలుపునకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలన్నారు.

## 22 నుంచి బాల ఏసు క్షేత్రంలో ఉత్సవాలు

**ప్రజాశక్తి - గోపాలపురం**

మండలంలోని దొండపూడి శివారులో ఉన్న బాల ఏసు పుణ్యక్షేత్రంలో ఈనెల 22 నుంచిఉత్సవాలు జరగనున్నట్లు పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ఎలెక్స్ తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. ఇక్కడ ప్రతిష్టాపించిన బాల ఏసు విగ్రహాన్ని జెరూసలేం నుంచి తీసుకొచ్చామన్నారు. మఠాధిపతి పోప్ జాన్‌పాల్ ఆశీర్వాదాలు పంపిచారన్నారు. ఉత్సవాల్లో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

## మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

**ప్రజాశక్తి - తాళ్లపూడి**

మండలంలోని వేగేశ్వరపురానికి చెందిన మనస్వి ఫౌండేషన్, శ్రీ షిర్డీ సాయి సేవాదళ్ విద్యా కమిటీ సంయుక్తంగా 50 మంది మెరిట్ విద్యార్థులకు రూ.1.60లక్షలను ప్రోత్సాహకాలకుగా అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో చదువుకోవడానికి గతం కంటే మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మనస్వి పౌండేషన్ సభ్యులు ఎం.వాసుదేవ్, ఎస్.సత్యనారాయణ, నాగిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తున్న సభ్యులు

# పకడ్బందీగా ప్రాక్టికల్ పరీక్షలు

## ఆర్ఐఓ ఎస్‌వీఎస్.నరసింహం



ముఖాముఖి

ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించనున్నామని ఆర్ఐఓ ఎస్ఎస్‌విఎల్ నరసింహం తెలిపారు. నేటి నుంచి ఒకేషనల్ విద్యార్థులకు, 26 నుంచి మార్చి 7 వరకూ జనరల్ విద్యార్థులకు దశలవారీగా ప్రాక్టికల్స్ పరీక్షలు జిల్లాలో జరుగనున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడు దశలుగా నిర్వహించబోయే ఈ పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారిని (ఆర్ఐఓ) పలకరించింది. ఆయన వెల్లడించిన వివరాలు మాటల్లోనే...

**ఉమ్మడి జిల్లాలో ఇంటర్మీడియెట్ విద్యార్థులు ఎంత మంది ఉన్నారు.?**

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలు 161, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 307 మొత్తం కలిపి 468 ఉన్నాయి. ఆ కాలేజీలలో 1,01535 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసిస్తున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 47,442 మంది కాగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 52,993 మంది ఉన్నారు. ఒకేషనల్ మొదటి సంవత్సరం విద్యార్థులు 5,079, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5121మంది మొత్తం కలిపి 10,200 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో పాటు, ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించాము. పరీక్షల నిర్వహణకు అద్యాపకులను సంసిద్ధం చేశాము.

**పరీక్షలు ఎప్పటి నుంచి ఎప్పటి వరకూ జరుగనున్నాయి.?**

ఒకేషనల్ విద్యార్థులకు నేటి నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జనరల్ విద్యార్థులకు ఈ నెల 26నుంచి మార్చి 7వ తేదీ వరకూ పరీక్షలను నిర్వహించనున్నాము. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకూ పరీక్షలు జరుగనున్నాయి. ఐదు రోజుల చొప్పున మూడు స్పెల్స్‌గా ఈ పరీక్షల నిర్వహణ చేపడుతున్నాం. జనరల్ విద్యార్థులకు 226 సెంటర్లను ఎంపిక చేశాము. పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చర్యలు చేపడుతున్నాము.

**పరీక్షలు ఏ విధానంలో ఉంటాయి. ఎన్ని సెంటర్లు..?**

ప్రాక్టికల్స్ నాన్ జంబ్లింగ్ విధానంలో జరుగనున్నాయి. అధ్యాపకులు మాత్రం జంబ్లింగ్ విధానంలో హాజరు కానున్నారు. ఒక కళాశాలలో ఎగ్జామినర్‌గా విధులు నిర్వహించిన వారికి రెండో రోజు ఏ కళాశాలకు వెళ్లాలనేది గంట ముందు మాత్రమే తెలియజేస్తాము. ఒకేషనల్ పరీక్షలకు 28 సెంటర్లను ఎంపిక చేశాము. తూర్పు గోదావరిలో 1, కోనసీమలో 22, కాకినాడలో 3, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశాము. ఒకేషనల్ విద్యార్థులు 10,200 మంది హాజరుకానున్నారు.

**పర్యవేక్షణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకున్నారు.?**

పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ లాగిన్‌లో ప్రాక్టికల్ పరీక్షల ప్రశ్న పత్రాన్ని ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. పరీక్ష నిర్వహించే అరగంట ముందు మాత్రమే పాస్‌వర్డ్‌ద్వారా సైట్ ఓపెన్ చేసి ప్రశ్న పత్రం ప్రింట్ తీసే అవకాశం లభిస్తుంది. దీని జిరాక్స్‌లను విద్యార్థులకు అందజేస్తాము. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నాం. సిసి కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నాం.

**విద్యార్థులకు మీరు ఇచ్చే సూచనలు ఏమటి..?**

ఇంటర్మీడియెట్ విద్యలో ప్రాక్టికల్స్ పరీక్షలు కీలకమైనవి. పరీక్షల నిర్వహణపై కళాశాలల వారీగా అవగాహన కల్పించాం. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాము. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా సమర్ధవంతంగా ప్రాక్టికల్స్ పరీక్షలు రాయాలి. ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఆకాంక్షిస్తున్నాము.

:: ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి ::

## డాక్టర్ అడ్డాలకు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కాకినాడకు చెందిన దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ జాతీయస్థాయి ఉత్తమ పురస్కారం అందుకున్నారు. గ్రామీణ ప్రజలకు అందించిన సేవలకుగాను ఆయనకు రెండు జాతీయ పురస్కారాలు అందించారు. ఈ సంధర్భంగా రాష్ట్ర ఐడిఎ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అజయ్ బెనర్జీ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా డాక్టర్ అడ్డాల చేసిన సేవలకు నేడు జాతీయ స్థాయిలో తగిన గుర్తింపు లభించటం ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ అడ్డాలకు సమాజం పట్ల ఉన్న భాద్యత అభినందనీయమని అన్నారు. అనంతరం డాక్టర్ అడ్డాల మాట్లాడుతూ ఈ పురస్కారాలు అందుకోవటం సంతోషంగా ఉందన్నారు. తనకు అనునిత్యం తోడుగా నిలిచిన తన కుటుంబ సభ్యులకు, రాష్ట్ర కాకినాడ ఐడిఎ సభ్యులకు ప్రజలకు ఉణపడి ఒటానన్నారు. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోరంట్ల సతీష్, డాక్టర్ సిరాజ్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ వివి.రావు, డాక్టర్ రఘురామ్, డాక్టర్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## గోపాలకృష్ణ గోఖలేకు ఘన నివాళి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

భారతదేశం నుంచి ఆంగ్లేయులను తరిమికొట్టాలని ఎన్నో ఉద్యమాలు నిర్వహించిన గోపాలకష్ణ గోఖలే గొప్ప స్వాతంత్ర సమరయోధుడని విశ్రాంత తహాశీల్దారు రేలంగి బాపిరాజు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గోపాలకష్ణ గోఖలే 108వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. మహాత్మా గాంధీ, మహమ్మద్ అలీ జిన్నాకు గోపాలకష్ణ గోఖలే రాజకీయ గురువన్నారు. జాతీయ భావాన్ని పెంపొందించడానికి ఆయన విశేష కషి చేశారని అన్నారు. అణగారిన వర్గాల కోసం 'సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ'ని స్థాపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.రత్నప్రసాద్, డాక్టర్ కుమార్ యాదవ్, బి.సత్యనారాయణ రాజు, రాజా పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## గుర్తు తెలీని మృతదేహాల స్వాధీనం

ప్రజాశక్తి-ఏలేశ్వరం, పిఠాపురం, రామచంద్రాపురం

మండలంలోని పెద్దనాపల్లి గ్రామ శివారు ఏలేరు కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మతదేహం ఆదివారం ఆ గ్రామస్తులు గుర్తించారు. గ్రామ విఆర్ఓ ఫిర్యాదు మేరకు ఏలేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సుమారు 35 సంవత్సరాలు వయస్సు కలిగి ఉండి 5 అడుగుల 5 అంగుళాలు ఎత్తు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసినవారు 9440904835, 9440796530 నెంబర్లలో సమాచారం ఇవ్వాలని తెలిపారు.

**పాదగయలో..**

పిఠాపురం పట్టణంలోని స్థానిక పాదగయ పుష్కరిణిలో ఆదివారం గుర్తు తెలీని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్టు సిఐ వైఆర్‌కె.శ్రీనివాసు తెలిపారు. సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలిచినట్లు చెప్పారు.

**రామచంద్రాపురంలో..**

రామచంద్రాపురం మండలంలోని కొత్తూరు గ్రామం వద్ద చోడవరం కాలువలో సుమారు 40 సంవుత్సరాలు వయస్సు గల ఒక గుర్తు తెలియని మహిళా మతదేహం లభ్యమైందని పోలీసులు తెలిపారు. ఎక్కడ నుంచో కొట్టుకొని వచ్చినట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేశారు. ఎవరైనా గుర్తు తెలియని మహిళా అదశ్య మైతే వివరాలు తెలిసిన వారు రామచంద్రపురం పోలీస్ స్టేషన్ నెంబర్ 08857 242333, ఎస్ఐ రామచంద్రపురం నెంబర్ 94407 96589 తెలియజేయాలన్నారు. ఎస్ ఐ సురేష్ బాబు దర్యాప్తు చేస్తున్నారు.

## వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - సీతానగరం

అప్పుల నేపథ్యంలో భార్యభర్తల మధ్య చోటు చేసుకున్న వివాదం భార్య ఆత్మహత్యకు దారి తీసింది. సింగవరం దుర్గమ్మ కాలనీలో వెంకటేశ్వం రావు, అనంతలక్ష్మి దంపతులు నివసిస్తున్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం వెంకటేశ్వరరావు అప్పులు చేశాడు. ఈ నేపథ్యంలో వారికి తరచూ వివాదాలు జరిగేవి. దీంతో అనంతలక్ష్మి మనస్తాపానికి గురైంది. శనివారం వెంకటేశ్వరరావు బయటకు వెళ్లిన సమయంలో అనంతలక్ష్మి(30) గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శుభశేఖర్ సిబ్బందితో పురుషోత్తపట్నంలో సంఘటనా స్థలానికి చేరుకుని మతదేహాన్ని వెలికితీశారు.

## దాడి కేసులో నలుగురిపై కేసు

ప్రజాశక్తి - సీతానగరం

ఉండేశ్వరపురంలో భూ సరిహద్దు తగాదాల నేపథ్యంలో దాడికి యత్నించిన నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంచాల వెంకటేశ్వరరావు కుటుంబానికి దొంగర వీరబాబు కుటుంబానికి గతంలో భూ సరిహద్దు తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వెంకటేశ్వరరావు అమ్మమ్మ నాగోతు బుల్లెమ్మాయిపై దొంగర వీరబాబు, దొంగర సాయి, దొంగర నాగు, దొంగర శ్రీదేవి కర్రతో దాడి చేశారు. అంతేకాక కత్తితో బెదిరించారు. ఆమెకు తలపై గాయమైంది. ఇదే సమయంలో కర్రలతో ఇరు గ్రూపుల వారు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో దొంగర వీరబాబు, నాగులకు కూడా గాయాలు అయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో వాలంటీర్ మృతి

ప్రజాశక్తి-కోటనందూరు/కరప

బిళ్లనందూరు గ్రామానికి చెందిన గ్రామ వాలంటీర్ మాదిరెడ్డి చిన్న శ్రీను ఆదివారం రోడ్డు ప్రమాదంలో మతి చెందాడు. పచ్చ కామెర్ల మందు కోసం రామచంద్రపురం బైకు మీద బయలుదేరగా తిరిగి ప్రయాణమై వస్తుండగా కరప మండలము వేములవాడ గ్రామ సమీపంలో బస్సు బైకు ఢీకొన్న ఘటంలో శ్రీను మతి చెందాడు. బాధిత కుటుంబాన్ని స్థానిక మండల పరిషత్ అధ్యక్షుడు ఎల్.శ్రీనువాస్, స్థానిక సర్పంచ్ బొచ్చ సత్తిబాబు పరామర్శించారు.

## వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మరణం

ప్రజాశక్తి-తాళ్లపూడి

తాళ్లపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో శని, ఆదివారాల్లో జరిగిన రెండు వేరు వేరు సంఘటనలో ఇద్దరు మతి చెందినట్లు ఎస్ఐ కెవి.రమణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం జిల్లా కేంద్రమైన రాజమహేంద్రి చెందిన ఆరుగురు వ్యక్తులు ఆదివారం సరదాగా తాళ్లపూడి మండలంలోని వేగేశ్వరపురం గ్రామానికి వచ్చి ఎత్తి పోతల పథకం పంపు హౌస్ వద్ద కాలవలో స్నానం చేశారు. వీరిలో శ్రీను(30) మద్యం మత్తులో స్నానం చేస్తుండగా మునిగిపోయాడు. అతనిని108లో తాళ్లపూడి ఆసుపత్రి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరుగొలను గ్రామానికి చెందిన ఎసి మెకానిక్ అడ్డగర్ల సురేష్ కుమార్ శనివారం రాత్రి తాళ్లపూడి గ్రామానికి వచ్చి శనివారం రాత్రి తిరిగి వెళు తుండగా బల్లిపాడు శివారు చిడిపి వద్ద కొవ్వూరు నుంచి తాళ్లపూడి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడని తాళ్లపూడి ఎస్ఐ తెలిపారు. మతిని తండ్రి సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్


## దుస్తుల షాపులో రూ.1.44 లక్షల అపహరణ

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ మెయిన్ రోడ్డు లో గల సత్య సారీ మందిర్ లో శనివారం రాత్రి దొంగలు పడి నగదు దొంగిలించారు. దీనిపై షాప్ యజమాని బెతా శివ ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.మెయిన్ రోడ్డు లోని తమ షాప్ షట్టర్ లు పగుల గొట్టి దొంగలు వారం రోజులుగా ఉన్న అమ్మకం సొమ్ము రూ. 1 లక్షా 44 వేలు దొంగిలించినట్లు ఫిర్యాదు లో పేర్కొన్నారు. ఈ మేరకు ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జ్యోతి బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ సభ్యులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నేరస్తుల వేలిముద్రలు సేకరించారు.

# అందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి-కాకినాడ



వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, వైసిపి సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్ జెడి పవన్ కుమార్ తెలిపారు. వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ఆదివారం 43 డివిజన్ మాజీ కార్పొరేటర్ జెడి పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, వైసిపి సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్ జెడి.పవన్‌కుమార్ ప్రారంభించారు. తొలుత డాక్టర్ అంబటి శ్రీప్రదీప్తికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో జెడి.పవన్ ఎంతగానో కషి చేస్తున్నారని, మహిళలకు వివిధ సమస్యలకు సంబంధించిన వైద్య పరీక్షలను నిర్వహించి వారికి ఉచితంగా మందులు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నమ్మి సత్యవాణి, గుత్తుల వీర వేణి, ఖమ్మం గణేష్, గణేష్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎల్ఎను దూషించిన ఘటనపై ఫిర్యాదు

ప్రజాశక్తి - తాళ్లరేవు



స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైసిపి నాయకులు

ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌పై సోషల్ మీడియా ద్వారా అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వైసిపి నాయకులు కోరంగి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎంఎల్ఎను అసభ్య పదజాలంతో దూషించి, సామాజిక వర్గాల మధ్య చిచ్చు రేపే విధంగా వ్యవహరిస్తూ సోషల్ మీడియాలో వీడియోలు పెట్టిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కాదా గోవింద్ కుమార్, సర్పంచ్‌లు రెడ్డిబాబు, వెంటపల్లి నూకరాజు, పెయ్యల మంగేష్, పినపోతు కామేశ్వరావు, రేవు మల్లేశ్వరి, వ్యవసాయ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొటికలపూడి చంద్రశేఖర్, ఎంపిటిసి రేకాడి నరసింహమూర్తి, పోతుల రత్నకుమారి, నాయకులు కొపనాతి నాగరాజు, అంకాడి అంజిబాబు, పెసింగి దాసు, బొంతుమోహన్, నల్లి శ్రీను, అద్దంకి లక్ష్మీనారాయణ, నీలపాల శ్రీను, మట్టపర్తి శ్రీనివాస్, పోతాబత్తుల నూకరాజు, మల్లాడి శ్రీను, తనుకు సత్యనారాయణ, దడాల పండు, రొక్కం లోవరాజు, అరదాడి అన్నవరం పాల్గొన్నారు.

# చివరి దశకు ఆలిండియా హాకీ లీగ్ పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్







మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారిణులు

కాకినాడలో ఆలిండియా సీనియర్ మహిళల హాకీ ఛాంపియన్‌షిప్ పోటీల లీగ్ మ్యాచ్‌లు చివరి దశకు చేరుకున్నాయి. ఆదివారం నాలుగు మ్యాచ్‌లు నిర్వహించారు. ఒడిషా- రాజస్థాన్ టీముల మధ్య మ్యాచ్ ఏకపక్షంగా జరిగింది. రాజస్థాన్ టీం ఒడిస్సా టీమ్‌కు 15 గోల్స్ సమర్పించుకుంది. మ్యాచ్ చివరివరకు రాజస్థాన్ తమ అధిపత్యాన్ని కనబరిచింది.

కర్ణాటక చండీగర్ మధ్య జరిగిన మ్యాచ్ నువ్వా నేనా అన్నట్టుగా సాగింది. రెండు టీములు గోల్స్ వేసి పైచే సాధించేందుకు చూసినా ప్లేయర్స్ ఒక్కరికి కూడా అవకాశం ఇవ్వలేదు. 2-1 తో కర్ణాటక విజయం సాధించింది. ఉత్తరాఖండ్- చత్తీస్‌ఘఢ్ మ్యాచ్ ఏకపక్షంగా సాగింది. నాలుగు గోల్స్‌తో చత్తీస్‌ఘఢ్ విజయం సాధించింది.

బీహార్, అస్సాం మ్యాచ్ రసవత్తంగా మారింది. బీహార్ అస్సాంపై పైచేయి సాధిస్తూ వరుసగా 2 గోల్స్ సాధించింది.

## కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డ్స్ వర్కర్ల యూనియన్ సమావేశం యూనియన్ అధ్యక్షులు ఎం.ప్రసాద్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. మధు హాజరై మాట్లాడారు. జిజిహెచ్‌లో సెక్యూరిటీ గార్డులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సెక్యూరిటీ గార్డులకు నెలకు వేతనం రూ.18వేలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూనిఫామ్స్ నిధులు మంజూరు చేయాలన్నారు. సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించుకుంటే మార్చి మొదటి వారం నుంచి ఆందోళనకు దిగుతామనిహెచ్చరించారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా నాయకులు వి.కొండలరావు, నగర నాయకులు ఎంఎస్.రాజు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతలపూడి సునీల్, గౌరవ సలహాదారు కుమార్, కార్యదర్శి జి.విజయలక్ష్మి యూనియన్ నాయకులు సూరిబాబు, మోహన్ పాల్గొన్నారు.

## నాగేంద్రబాబుకు న్యాయం చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-గోపాలపురం

పలువురు పాత్రికేయుల వేధింపుల కారణంగా ఆత్మహత్యాయత్నం చేసిన జర్నలిస్టు నాగేంద్రబాబుకు న్యాయం చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివారం గోపాలపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో దళిత సంఘాల నాయకులు మాట్లాడారు. ఒక ప్రయివేటు ఛానల్‌లో పనిచేస్తున్న నాగేంద్రబాబును ఇతర ఎలక్ట్రాన్ మీడియా రిపోర్టర్లు వేధించడంతో మనస్తాపానికి గురై శనివారం గోదావరిలో దూకి ఆత్మహత్యానికి పాల్పడ్డారు. ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేసే కొందరు అగ్రవర్ణాల పాత్రికేయులు దళిత పాత్రికేయులపై వివక్ష చూపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సంస్థల యాజమాన్యాలకు తప్పుడు సమాచారాన్ని ఇస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నరన్నారు. నాగేంద్రబాబు ప్రస్తుతం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. తనకు న్యాయం చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి రెండు రోజులైనా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. నాగేంద్రబాబును వేధించిన వారిపై అట్రాసిటీ కేసు పెట్ట చర్యలు తీసుకోవాలని, లేకుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో పోరాటానికి దిగుతామన్నారు. సమావేశంలో గెల్లా శ్రీనుబాబు, పత్తిపాటి రాంబాబు, తలారి చందు, తానేటి వీరరాఘవులు, చాపల రవి, డి.శాంతరమేష్,ప్రత్తిపాటి సుందరం తదితరులు ఉన్నారు.

## భాస్కరరావు సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం



భాస్కరరావు దంపతులకు సత్కారం

యాభై ఏళ్లుగా శివరాత్రి రోజున వేలాదిమందికి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్న భాస్కరరావు సేవలు ఆదర్శనీయమని పెద్దాపురం ఎమ్ఎల్ఎ నిమ్మకాయ చినరాజప్ప అన్నారు. ఉప్పలగుప్తంకు చెందిన పోలిశెట్టి భాస్కరరావు ప్రతి ఏటా శివరాత్రి రోజున గొల్లవిల్లి భీమేశ్వర స్వామి ఆలయంలో వేలాదిమందికి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ వార్షిక అన్నదాతగా పేరొందారు. భాస్కరరావు అన్నదాన కార్యక్రమం చేపట్టి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గొల్లవిల్లి భీమేశ్వర ఉత్సవ కమిటీ, గ్రామస్తులు శివరాత్రి సందర్భంగా భీమేశ్వర ఆడిటోరియంలో శనివారం రాత్రి భాస్కరరావు, శాంతకుమారి దంపతులను ఎమ్ఎల్ఎ చినరాజప్ప, ఉత్సవ కమిటీ,గ్రామస్తులు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్ఎల్ఎ చిల్లా జగదీశ్వరి, సమనస సర్పంచ్ పరమట శ్యామ్ కుమార్, నాయకులు నిమ్మకాయల జగ్గయ్య నాయుడు, చిల్లా పురుషోత్తం, లింగోలు పెద్దకాపు, పెయ్యల దుర్గారావు, ఉత్సవ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పలువురి సాయం

ప్రజాశక్తి - ఆలమూరు

అగ్ని ప్రమాదానికి గురై రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మడికికి చెందిన జాస్తి ఇందిరకు ఆదివారం పలువురు ఆర్థిక సాయం అందజేశారు. కొత్తపేట కాకతీయ కమ్మ మహాజన సంఘం రూ.20 వేలు, పారిశ్రామిక వేత్త మురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు రూ. 20 వేలు, టిడిపి నేత ఈదల సత్తిబాబు రూ.10 వేలు, గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు రూ. 5 వేలు సాయాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి అండదండగా ఉంటామని భరోసానిచ్చారు.

# మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మోటారు వాహనాలపై వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమంగా మద్యం బాటిల్స్ తరలిస్తుండగా పోలీసులు వారిని ఆదివారం అరెస్ట్ చేశారు. కోరుమిల్లి ఏటిగట్టు సమీపంలో తనిఖీ నిర్వహిస్తుండగా రావులపాలెం చెందిన నిందితుడు కె వీర వెంకట సుబ్బారెడ్డి నుంచి 8 విస్కీ, 87 బీర్ బాటిల్స్ ను, భీమవరం జిల్లా అత్తిలి మండలానికి చెందిన కె పద్మారావు నుంచి 128 మద్యం బాటిల్స్‌ను, రెండు మోటార్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు, అమలాపురం టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ వీరబాబు తెలిపారు. రెండు ఘటనలపై కేసు నమోదుకు ఆలమూరు ఎక్సైజ్ పోలీసులకు నివేదించినట్లు ఇన్స్పెక్టర్ వీరబాబు తెలిపారు.